# పేపర్‌బోయ్...

అది పట్టణం కాబట్టి తొలికోడి కూయలేదు.

కాని... మార్కేండేయ గుడిలోంచి సుప్రభాతం విన్పిస్తోంది. గాలి తరంగాల్లో కలిసి అల్లాహో...అక్బర్ అనే రాగం సాగిపోతోంది.

ఇంకా చీకటి తెరలు కరిగిపోలేదు. భానుడు పైపైకి పాకిరావటం లేదు. ఆ అబ్బాయి సైకిలెక్కాడు... వెనుక మోపెడు దినపత్రికలు !! పదమూడేళ్ళుంటాయేమో ? చలికి మొహం పాలిపోయింది. ఆ అబ్బాయి పేరు సుందరం. పేరుకు తగ్గట్టుగా సుందరంగానే వున్నా ఏడో తరగతి ఫెయిలవటంతో వాళ్ల నాన్న వీపు విమానం మోత మోగించి చివరికి ఈ పనిలో పెట్టాడు.

సుందరానికి ఉదయం లేవటమంటేనే బద్దకం. అలాంటిది ఈ పనిలో కుదిరిన తర్వాత మానసికంగా కృంగిపోయాడు కూడా ! మంచు కురిసే చలిలో పత్రికలు పంచాలి. వర్షంపడి తుఫానొచ్చినా సరే... లేచేసరికల్లా అందరి ఇళ్లల్లో పత్రికలుండాలి.

సుందరం ఆలోచిస్తూ సైకిల్ త్రొక్కుతున్నాడు.

ఏ కొంచెం ఆలస్యమయినా సరే అందరూ తననే తిడతారు. వేయటంలో క్రమం తప్పితే పేపర్ ఏజెంట్ తిడతాడు. ఎవరైనా పత్రిక వేయటం మానెయ్యమని చెప్పినా ఏజెంట్ తనను సంస్కృతంతో దులిపేస్తాడు తనేతప్పు చేసినట్టు.

భారంగా సైకిల్ తొక్కుతుంటే భరించరాని చలి వణికిస్తోంది. ఆ చలికి అమ్మ పక్కన దుప్పటి కప్పుకొని ఇంకా పడుకోవాలనే ఆరాటపడే వయసు.

ఉదయం అయిదు గంటలకే డిస్టర్బ్ చేస్తూ పేపర్ వేస్తే చివాట్లు. పేపర్లు పంచుతూ పోయి ఆఖరి ఇంటికి ఆలస్యమైతే అక్కడా చివాట్లే. ఏ ఒక్కరైనా బిల్లు సమయానికివ్వకపోతే ఏజెంట్‌తో తిట్లు.

తండ్రి గుర్తొచ్చి కోపంతో బలంగా సైకిల్ తొక్కుతున్నాడు సుందరం. సైకిల్ దిగుతూనే మొదటి ఇంట్లో పేపర్‌ని కిటికీలోంచి విసిరాడు కసిగా... రక్తసిక్తమైపోతున్న ఈ దేశాన్ని ముద్దలా మడిచి దూరంగా విసిరినట్టు !!

రెక్కలు తెగిపడ్డ పావురమై పేపర్ గాలికి రెపరెపా కొట్టుకుంది. అలా 'విద్యానగర్' లో అరవైరెండు పేపర్లు వేయాలి. ఒక్కోడు శవానికి కాపలాకాసినట్టుగా గేటు ముందే తన కోసం ఎదురుచూస్తాడు.

అలా వేస్తూ ముప్పయ్యవ ఇంటికి వచ్చేసరికి సుందరం మనసు ఉరకలు వేస్తుంది. కారణం ఆ పాటికి ఎవ్వరూ లేవని ఆ కాలనీలో ఆ ఇంటి ముందు రంగు రంగుల ముగ్గువేసి వుంటుంది. కాదు... ఆమె వేస్తూ ఉంటుంది.

సుందరాన్ని చూడగానే నవ్వుకుందామె. వెన్నల సొనలు రాలిపడుతున్నట్టు. ఎవరి ఆప్యాయతకూ నోచుకోని సుందరానికి ఆమె ఒక్కనవ్వే ఈ ఉద్యోగాన్ని నడిపిస్తోందంటే నమ్మాల్సిందే. ఆమె సుందరానికంటె మరో పన్నెండేళ్ళు పెద్ద. అంత పొద్దున్నే తలంటుస్నానం చేసి పొడవాటి కురులకు గుడ్డచుట్టి... ఆమె కనుబొమ్మల మధ్య సూరీడు పొడుస్తున్నంత పెద్దగా బొట్టుపెట్టి... కడిగిన ముత్యంలా కన్పిస్తుంది. మోకాలి మీద వోరగా వంగి ముగ్గులేస్తుంటే ఆమె మెడనించి వేలాడే తాళిబొట్టు 'ఊయల'లా వూగుతుంది. కురుల్లోంచి నీటిబొట్లు జారి జాకెట్టు వెనకభాగాన్ని తడిపేస్తాయి.

అప్పుడే సుందరం వెళ్తాడు. ఆమె నవ్వుతుంది ఆప్యాయంగా... మొదటిరెండు రోజులు అలాగే నవ్వి... మూడోరోజున "ఈ ప్రపంచాన్ని నీ చిన్నారి చేతుల్లో పట్టుకొస్తున్నావా? వెల్‌కమ్ మైడియర్ బాయ్" అంది. సుందరం పొంగిపోయాడు.

ఒక్క ఆమెకు పేపరందించడానికైనా సరే ఈ ఉద్యోగం చేయాలిన్పించింది

సుందరానికి. పేపర్ బిల్లుకోసంపోతే టీ పోసింది. మొదటిసారి సుందరం ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆఫ్టరాల్ ఒక పేపర్‌బాయ్‌కి మర్యాదనిచ్చిన ఆమె మనసు విశాలం అనుకున్నాడు.

ఆ ఇల్లు చేరుతున్న కొద్దీ సుందరం గుండె మధనపడిపోయింది. నిన్నటి సంఘటనతో. నిన్న ఇదే సమయానికి వెళ్ళాడు. ఆమె ముగ్గులేస్తుంది. కాని రోజులా అనిపించలేదు. సుందరాన్ని చూసి నవ్వాలని ప్రయత్నించింది. కాని బుగ్గల మీది కన్నీటి చారికలు ఎండిపోయి వెక్కిరించాయి. కళ్లల్లోని బాధ ఆమె పెదవుల్ని కదిలించలేకపోయింది.

సుందరం స్పష్టంగా చూసాడు, నిద్ర లేక కళ్ళువుబ్బి.... చెంపల మీద ఎండిపోయిన కన్నీటి మరకల్ని. ఎన్నో జన్మల బంధం వున్నట్టు ఆ పసిహృదయం కరిగిపోయింది.

"ఏమైందక్కా... అన్నాడు ఆత్రుతగా.

ఆ పిలుపులోని ఆప్యాయతకు ఆమె రెప్పలమాటున దాగిన అగ్ని గోళాల్లోంచి ఆర్తిగా ఓ కన్నీటి బొట్టు వేడిగా జారిపడింది.

ఆకాశం అప్పుడే ఎర్రబడుతోంది. ఆ వాడలో ఎవరూ లేవలేదింకా ! దూరంగా మార్కండేయ గుడిలోంచి సుప్రభాతం విన్పిస్తోంది.

"ఏమైందక్కా...."

ఆమె ఈసారి నవ్వింది. నవ్వి 'నీ పేరేమిటి కన్నా .... ?' అని మాత్రం అడిగింది.

"సుందరం" ఠక్కున చెప్పాడు.

"గుడ్‌నేమ్"

"మరి మీ పేరు ?" గొంతులో అమాయకత్వం తొణికిసలాడుతోంది. ఆమె నవ్వుకు వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి.

'భలేవాడివే... నా పేరు కావాలా ? ఏదో ఒకరోజు నువ్వే నా పేరును మోసుకొస్తావ్' అంది. సుందరానికేం అర్థంకాలేదు. ఆమె లోపలికెళ్ళిపోయింది. ఇది నిన్నటి రోజు జరిగిన సంఘటన !!

ఈరోజు సుందరం సైకిల్ దిగగానే ఆమె కన్పించలేదు. వాకిట్లో ముగ్గువేసి లేదు. రెండుసార్లు సైకిల్‌బెల్ నొక్కాడు. అప్పుడే ఆమె నిద్రలేచిందేమో ? మొహం పీక్కుపోయి వుంది. తాళిబొట్టుని కళ్లకద్దుకొని వచ్చి పేపర్ తీసుకొని మౌనంగా వెళ్ళిపోయింది.

తిరిగి వస్తూంటే ఆమె ముగ్గు వేస్తూ కన్పించింది. కాని సుందరం వైపు చూళ్లేదు.

ఆమె స్నేహంలో సుందరం అవ్యక్తమైన అనుభూతిని పొందుతున్నాడు. కుళ్ళు

గుణాల మనుషుల మధ్య వుంటున్నప్పటికీ నిష్కల్మశమైన ఆ పసిహృదయంలోని 'స్వచ్ఛత' ను స్నేహంగా మలుచుకుంటుందామె !!

అంత పొద్దున్నే ఆప్యాయంగా వస్తున్న ఆ చిన్నారి నేస్తాన్ని చూడగానే ఆమె కన్నులు విరబూసిన కలువలై నవ్వుతాయి. ప్రపంచాన్ని చిన్నారి భుజస్కందాల మీద మోసుకొస్తున్న వాడిలా వస్తుంటే... గాలి తరంగాలతో చెవుల్ని సోకుతున్న సుప్రభాతంతో ప్రతి ఉదయం ఆమెకు చిత్రమైన అనుభవాన్ని పంచుతున్నట్టుగా ఫీలవుతుంది.

మర్నాడు పేపర్ ఆలస్యంగా ఏడుగంటలకు వచ్చింది. సుందరం దినపత్రిక పంచుతూ ఆ ఇంటి దగ్గరికెళ్లేసరికి ముగ్గువేసి వుంది. సైకిల్ బెల్ నొక్కితే ఎవరో వచ్చి పేపర్ తీసుకున్నారు. కాని ఆమె రాలేదు. సుందరం డీలాపడిపోయాడు. మరోరోజు అయిదు గంటలకే వచ్చిన పేపర్లని తీసుకొని ఆ ఇంటిముందు కెళ్లాడు. ఆమె ముగ్గు వేస్తున్నదల్లా లేచింది పేపర్ తీసుకోవడానికి. ఆ చిరుచీకట్లో అనుకోకుండా ఆమె మెడవైపు చూసాడు.

రెండు మచ్చలు... సిగరెట్లతో కాల్చిన మచ్చలు కమిలిపోయి కన్పించాయి. ఆమె అతి ప్రయత్నంగా నవ్వింది. సుందరం ఆనందపడిపోయాడు.

"అక్కా... మీ పేరు చెప్పనే లేదు" అన్నాడు చొరవగా.

"నువ్వే తెల్సుకుంటావులే... సరేకాని ముగ్గు బావుందా ? " అనడిగింది.

"ఓ... భేషుగ్గా వుంది" కళ్లు చక్రాల్లా తిప్పి అన్నాడు. అతడి మోములోని పసితనానికి ఎందుకో... ఆమె కళ్లు చెమ్మగిల్లాయి.

"ఏం చదువుతున్నావ్ ?" అన్న ఆమె ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. "ఏడవ తరగతి చదువుతున్నాను".

'వెరీగుడ్' అంటూ పేపరందుకుంది. ఆమె కుడిచేయి మీద తీగలల్లుకున్నట్లు నల్లటిచారలు... సుందరం మనసు చివుక్కుమంది.

అవి బెల్ట్ దెబ్బలు !

సుందరం సైకిలెక్కి వెనుదిరిగి పోతుంటే ఆమె అనుకుంది.

"నా చిన్నారి నేస్తమా... నీ చిట్టిచేతుల్తో నా పేరును తొందర్లోనే పంచిపెడతావ్ ఈ ప్రపంచానికి...."

మరునాటి నించీ ఏడవతరగతి పరీక్షలు రావటంతో వారం రోజులు డెయిలీ పేపర్ల పంపకానికి సుందరం వెళ్లలేదు. పాసవుతానన్న గ్యారంటీ కలిగాక ఉత్సాహంగా సుందరం

ఉదయాన్నే పత్రికలు పట్టుకొని ఆ ఇంటి ముందు సైకిల్ దిగాడు.

ఆమె కన్పించలేదు...

చాలా సేపు నిల్చున్నాడు. సూర్యుడు బయటికొచ్చినా ఆమె బయటికి రాలేదు. నిరాశగా వెనుదిరిగిపోయాడు.

మర్నాడు అలాగే వెళ్లాడు. పేపర్ తీసుకోవడానికి ఎవరూ రాలేదు. కిటికీలోంచి జారవిడుద్దాం అనుకొని పేపర్ మడుస్తున్నవాడల్లా... మొదటి పేజీలో ఆమె కన్పించి నిశ్చేష్టుడయ్యాడు... ఆ ఫోటోలో నవ్వుతోంది ఎప్పటిలా...

సుందరం వెన్నెముకలోంచి చలికెరటం పాకిపోయింది. ఆమె ఫోటోపైన చింతగింజలంత అక్షరాలు.

"కట్నం కోరల్లో విజయలక్ష్మి బలి"

సుందరంలో కన్నీటి కాల్వలు తెగిపడ్డాయి. అస్పష్టంగా కన్పిస్తోన్న ఆ అక్షరాల వెంట పరుగులు తీసాయి.

భర్త చేసే అరాచకాల్ని... అత్తపెట్టే ఆరళ్లనీ... తోటికోడలి పోటుమాటల్ని అన్నింటినీ అధిగమించి మృత్యువుతో ముగిసిపోయిన విజయలక్ష్మి జీవితాన్ని చదివాడు.

"అక్కా..." చిన్ని గుండె బరువుగా మూలిగింది.

"నా పేరును నువ్వే మోసుకొస్తావ్..." ఆమె మాటలు గుండె గదుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. సైకిల్ క్యారియర్‌కు వున్న దినపత్రికలు గాలికి రెపరెపలాడాయి ఆమెను మోసుకొచ్చిన గుర్తుగా !!

సుందరం ఏడుస్తున్నాడు...

ముగ్గుని దిద్దుకోని వాకిలి బోసిగా ఏడుస్తోంది. వాడంతా నిర్మానుష్యంగా వుండి మౌనంగా రోదిస్తున్నట్టుగా వుంది. ఆ క్షణాన వెనుదిరిగిన సుందరం పేపర్లు పంచడానికి ఏనాడూ వెళ్లలేదు.

★ ★ ★